
# కనకారావు కంగారు



## కథ

**దూశి గురునాథరావు**

నేను సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి విశాఖ ఎక్స్‌ప్రెస్ నంబరు వన్ ప్లాట్‌ఫారం మీద రెడీగా వుంది. రిజర్వేషన్ బోగీలో నా బెర్తు చూసుకుని అందులో సామాన్లు సర్దికూచున్నాను. కొంతసేపటికి రైలు కదిలింది.

వనజతో నా పెళ్లి నిశ్చయమైనది. మరో వారం రోజులలో పెళ్లి. మా ఊరు శ్రీకాకుళం. ఉద్యోగరీత్యా హైద రాబాదులో వుంటున్నాను. నేను ఈ రైలులో శ్రీకాకుళం చేరాక పెళ్లితంతు ప్రారంభం అవుతుంది. అసలు వన జతో నా పెళ్లి నిశ్చయమవడానికి ముఖ్యకారకుడు కనకారావు.

కనకారావు మా పిన్ని కొడుకు. వాళ్లదీ శ్రీకాకు ళమే. కనకారావుకి నా వయసే వుంటుంది. బి.ఏ. చదివాడు. మనిషి మంచివాడే. కానీ కంగారెక్కువ. ప్రతి విషయంలో కంగారుపడిపోతూ ఉంటాడు. దీనికితోడు పరాకు కూడా ఎక్కువ. పరాకులోపడి, అసలు విషయం గుర్తుకు రాగానే తెగ కంగారుపడి పోతాడు. అందుకే మా వూరిలో వాడిని కంగారు కనకారావు అంటూ ఉంటారు. అసలువాడు ఈ లోకంలోకి రావడమే కంగారుగా వచ్చాడట. మా పిన్ని ఎనిమిదవ నెలలోనే వాడిని కనిందట. అయితే తొమ్మిది నెలలు నిండాకే వాడు పుట్టాడని, నెలలు లెక్కపెట్టడం తప్పయి వుంటుందని డాక్టర్లు అన్నా రట. కానీ, పెద్దవాళ్లకు ఎవరికైనా వాడిమీద కోపం వచ్చిందంటే, నెల తక్కువ వెధవ అని ముద్దుగా తిడ తారు.

కనకారావు, నేను ఒకే స్కూలు, ఒకే క్లాసులో చదివాం. నేను పన్నెండవ క్లాసయాక ఇంజినీరింగ్ చదవడానికి విశాఖపట్నం వెళ్లిపోయాను. కనకా రావు నాన్న మాత్రం వాడికి తన వ్యాపారంలో శిక్షణ ఇవ్వడానికి తనతోనే, శ్రీకాకుళంలోనే వుండి అక్కడే బి.ఏ. చదవమని చెప్పడంతో, కనకారావు శ్రీకాకు ళంలోనే డిగ్రీ చదివి వ్యాపారం కోసం స్థిరపడ్డాడు.

కనకారావు కంగారులో చేసే పనులను, మేం కథలు కథలుగా చెప్పుకునే వాళ్ళం. మేం స్కూలులో చదువుతున్నప్పుడు ఒకరోజు, కిరణాసామాన్లు కొని తెమ్మని మా పిన్ని సామానుల లిస్టు కనకారావు చేతిలో పెట్టి పంపింది. మనవాడు ఆ దుకాణం చేరే సరికి అదే టైములో అక్కడ ఒకడు కోతిని ఆడి స్తుంటే వీడు చూస్తూ ఆనందించసాగాడు. కోతిని ఆడించడం ఆగగానే వీడికి కిరాణా సామాన్ల సంగతి గుర్తుకు వచ్చింది. గబగబ చీటీ తీసి దుకా ణంలో ఇచ్చాడు. దుకాణంలో ఉన్న శెట్టి, చీటీ ప్రకారం సామానులు కట్టి పద్దురాశాడు. కనకా రావు ఆ సామానులు ఇంటికి తెచ్చి వాళ్ళ అమ్మకు ఇచ్చాడు.

ఆమె అవి చూస్తూనే, "ఇన్ని సామాను లేమిట్రా" అంటూ " కందిపప్పు మొన్ననే తెచ్చావు కదరా! ఈ మినపప్పు, పెసరపప్పు నేను వ్రాయలేదు" అంటూ చీటీ వైపు చూసింది.

"ఒరేయ్! కంగారులో ఇవ్వాల్టి చీటీ బదులు మొన్నటి చీటీ ఇచ్చేసావా ఏంటి?" అంది.

"పొరపాటయిపోయిందమ్మా" అంటూ సామా నులు మార్చితేవడానికి దుకాణం వైపు ఈసురో మంటూ వెళ్లాడు కనకారావు.

కనకారావు కంగారులో చేసే పనులు అన్నీ ఇన్నీ కావు. గుడి దగ్గర చెప్పులు మరచిపోయి కంగారుగా ఇంటికి వచ్చేవాడు. ఒక బస్సుకి బదులు ఇంకో బస్సు ఎక్కేసేవాడు. స్కూలుకి లేటుగా వచ్చినప్పుడు కంగారులో తన క్లాసుకి బదులు ఇంకో క్లాసులో దూరి, టీచరు చేత చీవాట్లు తినేవాడు.

కనకారావు కంగారుకి పరాకాష్ఠగా అతని పెళ్లి గురించి చెప్పుకుంటారు అంతా. అతని పెళ్లి మా చుట్టాలమ్మాయితోనే కుదిరింది. కుదిరిన దగ్గర నుండి అన్ని విషయాలలోనూ తెగ కంగారుపడి పోతూ పనివాళ్లను కూడా కంగారు పెట్టేవాడు. మా పిన్ని వాడికి సర్దిచెప్పింది. "ఒరేయ్! నీ కంగారు కాదు కాని, మమ్మల్ని చంపుతున్నావు. నీ విషయం తెలిసి పెళ్లివారు 'పెళ్లి కేన్సిల్' అన్నారంటే, ఈ జన్మలో నీకు పెళ్లికాదు. జాగ్రత్త" అంటూ వార్నింగ్ ఇచ్చింది. ఆ దెబ్బకు కొంచెం భయపడ్డాడు. కానీ పుట్టుకతో వచ్చిన అలవాటు కొనవరకు కనకారావు తోనే వుంటుంది.

పెళ్లిపీటల మీద తన ప్రక్కనే కూచున్న పెళ్లికూ తుర్ని చూసి చాలా మురిసిపోయాడు కనకారావు. ఎప్పటికీ పెళ్ళి తంతు ముగుస్తుందా..ఎంతవేగంగా ఆమెను ఎత్తుకుపోదామా అని మనసులో తెగ కంగా రుపడిపోతున్నాడు. రాత్రి ఎనిమిది గంటలకు ముహూర్తం. ఆడపెళ్లివారు పెళ్లి ఎరేంజిమెంట్లు చాలా బాగా చేశారు. లైట్లు దేదీప్యమానంగా వెలు గుతున్నాయి. రంగు రంగుల లైట్లు కళ్యాణ శోభను ప్రకటిస్తున్నాయి. సన్నాయి మేళంలో ఇద్దరు సన్నాయి వాయించేవాళ్లు తెగపోటీ పడి వాయిస్తు న్నారు.

పంతులుగారు మంగళసూత్రాలను కనకారా వుకు అందించి "నేను మంత్రం చదువుతూంటాను. నువ్వు పెళ్లి కూతురి మెడలో తాళికట్టు" అన్నారు.

కనకారావు పంతులుగారి వద్దనుండి మంగళ సూత్రాలను తీసుకుని పెళ్లికూతురు మెడలో కట్టడా నికి లేచాడు.

ఇంతలో...

కరెంటుపోయింది. అంతా ఒక్కసారి అంధకార బంధురమయింది.

అయితే...

సన్నాయి మేళం వాయిద్యాలు ఆగలేదు. పంతు లుగారు 'మాంగల్య తంతునానేనా మమ జీవన హేతునా' మంత్రం చదవడం ఆపలేదు.

కనకారావుకు మాత్రం చీకట్లో కంగారు ఎక్కువై

పెళ్లికూతురు పక్కనే కూచున్న ఆమె చెల్లెలు మెడలో తాళి కట్టేశాడు. తాళికడుతుండగా లైట్లు వెలిగాయి జనరేటరు సాయంతో. ఆ దృశ్యం చూసిన వారంతా అవాక్కయ్యారు.

"పంతులుగారూ! ఇంకో తాళి ఇవ్వండి పెళ్లికూతురు మెడలో కడతా" అన్నాడు కనకారావు.

"ఇంకో తాళి లేదయ్యా" పంతులుగారి కోపం.

"నా మెడలో తాళికట్టాడు కనుక అతడే నా భర్త" అంది జలజ. పెళ్లికూతురు వనజకు చెల్లెలు జలజ.

"అదెలా అవుతుంది? నేను ఒప్పుకోను" కనకారావు.

"ఒప్పుకొని తీరాలి" జలజ.

"ఆరాటం పెళ్లికొడుకు కంగారులో అత్తగారి మెడలో తాళికట్టేశాట్ట. ఇక్కడ అలాగే వుంది" ఓ పెళ్లి పెద్దఉవాచ.

"అయ్యా! పెళ్లి జరిగిపోయింది.





నా సంభావన ఇస్తే నేను వెళ్లివస్తా" పంతులుగారి తొందర.

ఆఖరుకు పెళ్లికూతురు వనజ తండ్రి కనకారావుని, అతని తండ్రిని ప్రాధేయపడ్డాడు.

"మా జలజ కూడా కనకారావుకి ఈడూ జోడే. జలజ కూడా అన్నిపనులు, ఇంటి పనులు వంట పనులు అన్నీ చక్కగా చేస్తుంది. కట్నకానుకలలో గానీ, మిమ్మల్ని అల్లుడుని సంతోషపెట్టడంలోగాని, ఎటువంటి లోటు రానివ్వను. కనకారావు, జలజ చూడముచ్చటగా ఉన్నారు. ఈ పెళ్లి దైవ నిర్ణయం ప్రకారం జరిగినట్లుంది. కాదనకండి"

వనజ తండ్రి కన్నీళ్లతో ఎంతో ప్రాధేయపడ్డాడు.

చివరకు పెద్దలందరు సమస్య పరిష్కారానికి సమావేశమయ్యారు. అందరు తలో మాట అంటున్నారు. అక్కడే వున్న నాకు ఓ ఆలోచన వచ్చింది. వెంటనే అక్కడివారితో అన్నాను.

"వనజకు, వాళ్ల వాళ్లకు ఇష్టమయితే, నేను వనజను పెళ్లి చేసుకుంటాను" అన్నాను.

వనజ తల్లిదండ్రుల కళ్లలో అప్పుడు వెలిగిన కాంతిని నేను ఇప్పటికీ మరచిపోలేదు.

ఆ తరువాత మా పినతండ్రి అంటే కనకారావు తండ్రి, కనకారావు, వాళ్ల కుటుంబం అంతా జలజను వాళ్ల కోడలుగా అంగీకరించారు. నేను వనజను పెళ్లి చేసుకోవడాన్కి మా వాళ్ళంతా కూడా అంగీకరించారు.

వనజ కూడా తన ఇష్టాన్ని తెలియజేయడంతో కథ సుఖాంతమయింది. నేను పెళ్లికొడుకునయ్యాను.

○